

క్యాన్సర్‌ను గెలిచి.. కొడుకుకు కిడ్నీనిచ్చి.. 8లో



తిరుపతి డబుల్ డెక్కర్ రద్దు 8లో



విద్యా వ్యాపారంపైనే నా యుద్ధం
పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి 8లో

సాక్షి విశాఖపట్నం

బుధవారం । 23 । జులై । 2025

న్యూస్‌రీల్

సైనిక ఉద్యోగులకు విభిన్న కోర్సులందిస్తాం



వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌తో పలు అంశాలపై చర్చిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మంగళవారం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ ఎస్.ఎస్.రాజా సుబ్రమణి సందర్శించారు. ఆయనకు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయ రావు స్వాగతం పలికారు. అనంతరం ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్‌తో కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు పలు కీలక అంశాలపై చర్చించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వీసీ ఆయనకు వివరించారు. త్రివిధ దళాల ఉద్యోగులకు ఏయూ ఎల్లవేళలా సేవలందించడానికి సిద్ధంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయంలోని మానవ వనరులను సైనిక ఉద్యోగుల అభివృద్ధికి, వారిలో విభిన్న నైపుణ్యాలను పెంపొందించడానికి వినియోగిస్తామని తెలిపారు. 'సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్'ద్వారా త్రివిధ దళాలకు ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తామని, త్రివిధ దళాల్లో పనిచేస్తున్న సైనిక ఉద్యోగులకు అవసరమైన విభిన్న కోర్సులను అందిస్తామని వీసీ స్పష్టం చేశారు.

నర్సింగ్ అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

ఎంవీపీకాలనీ: బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత కలిగి హాస్పటల్స్, కేర్ హోమ్స్‌లో 2 నుంచి 3 ఏళ్ల పని అనుభవం గల ఎస్సీ, ఎస్టీ మహిళ అభ్యర్థులకు ప్రభుత్వం జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు తెలిపారు. పై అర్హత గల మహిళ అభ్యర్థులకు స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా 7 నుంచి 8 నెలలపాటు ఉచితంగా నైపుణ్య శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. అనంతరం వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల 39 ఏళ్లలోపు మహిళ అభ్యర్థులు https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆగస్టు 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్టీల్‌ప్లాంట్‌లో పర్మనెంట్ కార్మికుల బదిలీలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పర్మనెంట్ కార్మికులను అంతర్ విభాగ బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్‌లో ఇప్పటివరకు అధికారులకు బదిలీలు జరిగేవి. కార్మికులను అడపా దడపా అప్పుడప్పుడు బదిలీ చేసేవారు. ఇప్పుడు ఒకేసారి 45 మంది కార్మికులను వివిధ విభాగాలకు బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై ఆందోళన చేయడానికి సమాయత్తం అవుతున్నట్టు ఆయా కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.

26న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

బీచ్‌రోడ్డు: జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన ఈ నెల 26వ తేదీన జిల్లా పరిషత్ స్థాయీ సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో 1 నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశాలను ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయని పేర్కొన్నారు.

డీ-సెట్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన గడువు పొడిగింపు

భీమునిపట్నం: డీ-సెట్ ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన గడువును మరో రెండు రోజులు పొడిగించారు. ఈ విషయాన్ని భీమిలిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ మంగళవారం తెలిపారు. ఐదు రోజులుగా జరుగుతున్న ఈ పరిశీలన కార్యక్రమం మంగళవారంతో ముగియాల్సి ఉండగా, మరింత మంది అభ్యర్థులకు అవకాశం కల్పించే ఉద్దేశంతో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఈ నెల 23, 24 తేదీల్లో కూడా ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆగస్టు 8 నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: విజయవాడ-విశాఖపట్నం-విజయవాడ(12718/12717) మధ్య నడుస్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 8వ తేదీ నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడవనుంది. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల వల్ల ఈ రైలు మరింత వేగంగా రాకపోకలు సాగించనుంది. ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ప్రయాణం ఉంటుందని వాల్తేరు డివిజన్ అధికారులు తెలిపారు.

మసాజు మాటున గలీజు

స్పా ముసుగులో వ్యభిచారం



- విదేశాల నుంచి యువతుల దిగుమతి
- ఇన్‌స్టా, వాట్సాప్ గ్రూపుల ద్వారా హైటెక్ వ్యాపారం
- పోలీసుల దాడులతో బట్టబయలు
- ఇప్పటికే రెండు స్పాలపై చర్యలు
- మిగిలిన వాటిపై పోలీసుల నిఘా

విశాఖ సిటీ : విశాఖ హైటెక్ వ్యభిచారానికి కేంద్రంగా మారిపోయింది. స్పా సెంటర్ల ముసుగులో గలీజు వ్యవహారం సాగుతోంది. మసాజు మాటున వ్యభిచారం నడుస్తోంది. సామాజిక మాధ్యమాలు, మెసేజింగ్ యాప్‌ల ద్వారానే దందా జరుగుతోంది. వెల్‌నెస్.. స్పా సెంటర్ల పేరుతో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కేంద్రాలు కొన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. వీటి నిర్వాహకులు కొందరు విదేశాల నుంచి యువతులను దిగుమతి చేసుకుంటూ.. వారితో చీకటి వ్యాపారానికి తెరలేపుతున్నారు. సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన యాడ్స్ ద్వారా విటులను ఆకర్షిస్తున్నారు. అన్ని రకాల సేవలను అందిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా స్పా సెంటర్లపై పోలీసులు ఫిర్యాదులు అందాయి. దీంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వీటిపై నిఘా పెట్టాలని ఆదేశించారు. గత వారంలో వరుసగా రెండు స్పా సెంటర్లపై చేసిన దాడుల్లో వారి మసాజ్ బాగోతం బయటపడింది.

హైటెక్ దందా

సామాజిక మాధ్యమాల ద్వారానే 80 శాతం హైటెక్ వ్యభిచారం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అసాంఘిక కార్యకలాపాలకు పలువురు నిర్వాహకులు లోకేంటో, ఇన్‌స్టా, టెలీగ్రామ్, వాట్సాప్.. ఇలా సామాజిక మాధ్యమాలు, మెసేజింగ్ యాప్‌ను వినియోగించుకుంటున్నారు. వీటిలో డిజిటల్ యాడ్స్ ద్వారా విటులను ఆకర్షిస్తున్నారు. వాటిలో ఉన్న నెంబర్‌కు మెసేజ్ చేస్తే చాలు. వెంటనే ఆటో జనరేటెడ్ రిప్లయ్ వచ్చేస్తుంది. ఎటువంటి సేవలు అందిస్తారన్న వివరాలు అందులో ఉంటాయి. మరో నిమిషంలోనే ఫోన్ మోగుతుంది. మధురమైన వాయిస్‌తో వారి అందించే సేవలు, వారి చార్జీలు వివరిస్తారు. ఓకే అంటే చాలు.. వెంటనే లొకేషన్ మొబైల్‌కు వచ్చేస్తుంది. ఇదీ విశాఖలో సాగే హైటెక్ వ్యభిచారం. సాధారణ మసాజ్‌లకు రూ.1000 నుంచి రూ.2500 ఛార్జ్ చేస్తున్నారు. అయితే క్రాస్ మసాజ్ నుంచి ప్రత్యేక సేవలకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. వ్యక్తిగత సేవలు కావాలంటే రూ.2 వేలు నుంచి రూ.3 వేలు వసూలు చేస్తున్నారు.

నగరంలో 71 స్పా సెంటర్లు

ఆకర్షణీయమైన ఎంట్రన్స్.. లోపల అడుగు పెడితే అద్భుతమైన యాంబియన్స్.. అందమైన యువతులతో స్వాగతాలు.. స్టార్ హోటల్‌ను తలపించే రూమ్‌లు.. ఇలా నగరంలో ఇలా రూ.కోట్లు ఖర్చు పెట్టి స్పా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ప్రస్తుతం 71 వరకు ఈ వెల్‌నెస్, స్పా, రిలాక్స్ కేంద్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. సిరిపురం, పాండురంగాపురం, బీచ్ రోడ్డు, సీతమ్మధార, గాజువాక ప్రాంతాల్లోనే సగం కంటే ఎక్కువగా సెంటర్లు ఉన్నాయి. వీటిలో కొన్ని స్పా సెంటర్ల నిర్వాహకులు అసాంఘిక కార్యకలాపాలకు పూనుకుంటున్నారు. విదేశాల నుంచే కాకుండా ఈశాన్య రాష్ట్రాల నుంచి యువతులను దిగుమతి చేసుకుంటున్నారు. శరీరం అలసిపోయిన, కండరాలు బిగుసుకుపోయిన వారికి అనేక రకాల మసాజ్ సేవలు అందిస్తున్నట్లు ప్రకటిస్తున్నారు. కానీ లోపల జరిగే తంతే వేరుగా ఉంటోంది. చట్ట విరుద్ధ కార్యకలాపాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..



కూటమి ప్రభుత్వంలో విశాఖలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయింది. ఒకవైపు డ్రగ్స్, గంజాయి వినియోగం విస్తృతంగా పెరిగిపోయింది. హత్యలు, గ్యాంగ్‌వార్‌లు, దాడులు, దోపిడీలతో ప్రశాంత విశాఖలో అలజడి రేగుతోంది. తాజాగా ఈ స్పా సెంటర్లలో వ్యభిచారం వ్యవహారం బట్టబయలవడం నగరంలో పరిస్థితికి అద్దం పడుతోంది. గత వారంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో రెండు స్పా కేంద్రాల్లో వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు.

నెలవారీ మామూళ్లు..

స్పా సెంటర్ల ముసుగులో జరుగుతున్న చీకటి వ్యాపారానికి కొంత మంది పోలీసుల నుంచి సహకారం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంలో ఒక్కో స్పా సెంటర్ నుంచి నెలకు రూ.10 వేలు స్టేషన్‌కు అందుతున్నట్లు సమాచారం. ఇక అసాంఘిక కార్యకలాపాలు సాగించే సెంటర్ల నుంచి రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు ముట్టజెబుతున్నారన్న టాక్ ఉంది. అందువల్లే ఇన్నాళ్లు ఆ స్పా సెంటర్ల వ్యవహారం బయటపడలేదన్న వాదనలు ఉన్నాయి. వీటి నిర్వహణ, చట్ట విరుద్ధ కార్యక్రమాలపై అనేక ఫిర్యాదులు రావడంతో సీపీ శంఖబ్రత బాగ్చి గతంలో ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. దీంతో అన్ని కేంద్రాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టారు. కానీ ఇప్పటి వరకు ఒక్క కేంద్రంలో కూడా ఈ తరహా వ్యవహారం వెలుగు చూడలేదు. తనిఖీలకు వెళుతున్న సమాచారం నిర్వాహకులకు ముందుగానే అందుతుందన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. తాజాగా రెండు కేంద్రాల్లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో మాత్రం వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు. వాటి నిర్వాహకులను అరెస్టు చేశారు. దీంతో మిగిలిన స్పా సెంటర్లపై కూడా నిఘా పెట్టాలని సీపీ అధికారులను ఆదేశించారు.



పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందే..

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

బీచ్‌రోడ్డు : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పాటించడంతోపాటు తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించి కార్మికులను, ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను, పరిశ్రమల నిర్వాహకులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వివిధ విభాగాల అధికారులు, పరిశ్రమల నిర్వాహకులతో కూడిన జిల్లా క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. పరిశ్రమల్లో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. పరిశ్రమల్లో అన్ని చోట్లా ఆటోమెటిక్ అలారం మెకానిజం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా కంపెనీల్లో పనిచేసే సిబ్బందికి, కార్మికులకు తప్పనిసరిగా బీమా పాలసీ చేయించాలని, పీపీఈ కిట్లు అందజేయాలన్నారు. కంపెనీల్లో తరచూ సేఫ్టీ ఆడిట్లు చేపట్టాలని, పైప్ లైన్లు, విద్యుత్ వైరింగ్, ఇతర పరికరాలను తనిఖీ చేయాలని సూచించారు. ఆఫ్ సైట్, ఆన్ సైట్ ఎమర్జెన్సీ ప్లాన్ ఎల్లప్పుడూ సిద్ధం చేసుకొని ఉంచుకోవాలని చెప్పారు. కార్మికులకు అన్ని రకాల వసతులు కల్పించాలని, పర్యావరణ హిత విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అన్ని చోట్లా ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీంలను నిత్యం అందుబాటులో ఉంచాలని సూచించారు. ఫ్యాక్టరీల చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, విశాఖ, భీమిలి ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాధుర్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు, డీఎఫ్‌వో, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీసు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు.

అయోధ్య పేరిట వ్యాపారం?

- ఫిర్యాదు చేసిన భద్రాచలం దేవస్థానం అధికారులు
- డబ్బుల వసూళ్లు తప్పుడు ప్రచారం అంటున్న నిర్వాహకులు





బీచ్‌రోడ్డు: నగరంలో ఏర్పాటు చేసిన అయోధ్య రామ మందిర నమూనా వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం ఎదురుగా ఈ సెట్‌ను గరుడ అనే సంస్థ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సెట్ ఆధారంగా అయోధ్య పేరిట వ్యాపారం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారి వ్యాపారంలో భద్రాచలం దేవస్థానాన్ని వాడుకోవటంపై ఆ దేవస్థానం ఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతోపాటు సెట్ నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఇదంతా తమపై కావాలనే కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారమని నిర్వాహకులు చెబుతున్నారు.

కల్యాణోత్సవం పేరిట వసూళ్లు: అయోధ్య రామ మందిరం సెట్ వేసి భక్తులకు రాముని దర్శనం కల్పించారు. అంతవరకు బాగానే ఉంది. ఈ నెలాఖరుకు ఈ సెట్‌ను తొలగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అయోధ్య రాముడి కల్యాణోత్సవానికి నిర్వాహకులు సిద్ధమయ్యారు. దీన్ని స్వయంగా భద్రాచలం దేవస్థానం పండితులచే నిర్వహించనున్నట్లు ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం భక్తుల నుంచి రూ.2,999 చొప్పున వసూళ్లు చేస్తుండటమే ఆరోపణలకు తావిచ్చింది.

భద్రాచలం అధికారుల ఫిర్యాదు

ఈ కల్యాణోత్సవంలో తమ దేవస్థాన పండితులు ఎవరూ పాల్గొనటం లేదని, ఇది కేవలం తప్పుడు ప్రచారమేనని భద్రాచలం దేవస్థానం అధికారులు మూడో పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా తమ దేవస్థానం పేరు వాడుకుని భక్తుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తప్పుడు రసీదుతో దుష్ప్రచారం

ఈ వివాదంపై గరుడ సంస్థ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. కల్యాణోత్సవం కోసం భక్తుల నుంచి రూ.2,999 వసూళ్లు చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్న రసీదును కొందరు కావాలనే తప్పుడు ప్రింటింగ్ చేశారని తెలిపారు. కొండవీటి రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిగే ఈ కల్యాణోత్సవంలో భద్రాచలం నుంచి తీసుకొస్తున్న బ్రాహ్మణ బృందం పాల్గొంటుందని చెప్పామే తప్ప, భద్రాచలం దేవస్థానం పండితులచే నిర్వహిస్తున్నట్లు ఎక్కడా ప్రచారం చేయలేదన్నారు. తమపై కావాలనే ఎవరో చేస్తున్న తప్పుడు ప్రచారమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

వాడపల్లికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

దాబాగార్డెన్స్: తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి బి.అప్పలనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారం ఉదయం 4 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి వాడపల్లి చేరుకుంటుందని, భక్తుల ప్రదక్షిణలు, స్వామి దర్శనం అనంతరం సాయంత్రం 4 గంటలకు వాడపల్లిలో బయలుదేరి రాత్రి 9 గంటలకు విశాఖ చేరుతుందన్నారు. మధ్యాహ్నం భోజన సదుపాయం వాడపల్లి ఆలయంలో ఉంటుందన్నారు. ప్రయాణ చార్జీ(ఒక్కొక్కరికి) సూపర్ లగ్జరీ రూ.1,000గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. టికెట్స్ కావాల్సిన వారు https://www. apsrtconline.in/లో విశాఖపట్నం-వాడపల్లి రూట్, శనివారం తేదీ ఎంపిక చేసుకుని, సీట్లను రిజర్వ్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9959225602, 9052227083, 9959225594, 9100109731 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

వర్షాకాలంలోనూ అదే స్పీడ్..!



భానుడు భగభగల కారణంగా పెరిగిన విద్యుత్ వినియోగం

- ఈపీడీసీఎల్ పరిధిలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం
- జూలైలో 16న 97 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం
- ఈనెలలో ప్రతిరోజూ నగటు వినియోగం 92 మి.యూనిట్లకు చేరిక

సాక్షి, విశాఖపట్నం: వరుణుడు కరుణించాల్సిన సమయంలో సూరీడు సుర్రుమనిపిస్తున్నాడు. వర్షంలో తడిసి ముద్దవ్వాల్సిన జనం.. ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వర్షాకాలం మొదలై నెలరోజులు గడిచినా ఉష్ణోగ్రతలు తారస్థాయిలో నమోదవుతున్నాయి. ఉష్ణోగ్రతలు 36 నుంచి 38 డిగ్రీల మధ్యలో నమోదవుతున్నా.. ఉక్కబోత మాత్రం 45 నుంచి 48 డిగ్రీల ప్రభావం చూపిస్తోంది. వేడి తట్టుకోలేక జనం ఉదయం నుంచి రాత్రి వరకూ ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లకే అతుక్కుపోతుండటంతో విద్యుత్ మీటర్లు గిర్రుగిర్రుని తిరుగుతున్నాయి. ఈపీడీసీఎల్ పరిధిలో జూలై నెలలో సాధారణం కంటే విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో పెరిగిపోయింది. చరిత్రలో ఎన్నడూ లేనంతగా డిమాండ్ పెరుగుతుండటంతో దానికి అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. లోడ్ పెరుగుతుండటంతో సరఫరాలోనూ లోపాలు తలెత్తుతున్నాయి.

గరిష్ట స్థాయికి చేరుకుంటున్న డిమాండ్

ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వాడకం అధికంగా జరుగుతుండటంతో సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకునేందుకు ఈపీడీసీఎల్ అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఐదు సర్కిళ్ల పరిధిలో జూలై నెలలో ప్రతి గంటకు 3,700 నుంచి 3,800 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఉంటుంది. కానీ ఈ ఏడాది జూలైలో మాత్రం రికార్డు స్థాయికి చేరుకుంది. ఈ నెల 16న రాత్రి 9.38 గంటల సమయంలో ఏకంగా 4,737 మెగావాట్లకు చేరుకోవడంతో అధికారులు సైతం అవాక్కయ్యారు. గతేడాది ఇదే సమయంలో 3,716 మెగావాట్లు మాత్రమే వినియోగం జరగగా.. ఈ సారి 1000 మెగావాట్స్ అదనపు భారం పడింది. డిమాండ్‌కు మించి సరఫరా ఉండటంతో అధికారులు లోటు భర్తీ చేసేందుకు ఎప్పటికప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా రాత్రి 10 గంటల సమయంలోనూ డిమాండ్ పీక్స్‌కు చేరుకుంటోంది. ఒకే సమయంలో అందరూ ఏసీలు, కూలర్లు ఆన్ చేస్తుండటంతో కొన్ని ప్రాంతాల్లో లోడ్ పెరిగి ట్రిప్ అవుతూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఇదే అదనుగా కోతలకు ఈపీడీసీఎల్ అధికారులు పనిచెప్పారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ కోతలు కూడా గరిష్ఠంగానే పెరిగాయని ప్రజలు వాపోతున్నారు.

ఈపీడీసీఎల్ పరిధిలో 10 రోజులుగా వినియోగం

(మిలియన్ యూనిట్లు)

తేదీ	2024	2025
12- జూలై	76.04	89.62
13- జూలై	73.38	88.48
14- జూలై	72.69	92.37
15-జూలై	72.86	94.82
16-జూలై	75.08	97.09
17-జూలై	75.32	93.44
18-జూలై	71.92	90.55
19-జూలై	65.46	88.73
20-జూలై	62.65	84.87

20 మిలియన్ యూనిట్లు అదనంగా..



ఈపీడీసీఎల్ పరిధిలో జూలై నెలలో ప్రతి రోజూ సగటున 72 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరగుతుంటుంది. అయితే భానుడి ప్రతాపంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిపోయింది. జూలై 10 నుంచి కరెంట్ వినియోగం భారీగా పెరుగుతూ వస్తోంది. సగటు విద్యుత్ వినియోగం రోజుకు 82 నుంచి 92 మిలియన్ యూనిట్లుగా మారిపోయింది. జూలై 16న ఏకంగా 97 మిలియన్ యూనిట్లు విద్యుత్ వాడేశారంటే.. ఎండ తీవ్రత ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నిద్రసుఖమెరుగదు



ఆకలి రుచి ఎరుగదు... నిద్ర సుఖమెరుగదు.. దీనికి అద్దం పడుతోంది ఈ చిత్రం. రోడ్డుపై భిక్షాటన చేస్తూ జీవనంగడిపే ఒక కుటుంబం మధ్యాహ్నం సమయంలో ఇలా చెట్ల కింద ఫుట్‌పాత్‌పైనే నిద్రిస్తున్నారు. కూలి పనికి వచ్చిన వారు సైతం మధ్యాహ్నం భోజనం తరువాత కొద్దిసేపు కునుకు తీసి తిరిగి పనికి ఉపక్రమిస్తున్నారు. ఎండ ప్రభావం తీవ్రంగా ఉన్నా.. రణగొణ ధ్వనులు ఉన్నా ఆదమరచి నిద్రపోతూ కనిపించారు. ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్

సైనిక వందనానికి సిద్ధం



పాకిస్తాన్‌పై యుద్ధంలో సాధించిన విజయానికి చిహ్నంగా బీచ్‌రోడ్డులో విక్టరీ ఎట్ సీ స్థూపం ఏర్పాటు చేశారు. దీనిని నావికాదళం నిర్వహణలో ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. వివిధ సందర్భాలలో ఇక్కడ ఉన్నతాధికారులు, సైనికులు హాజరై వీరసైనికులను గౌరవ వందనం సమర్పిస్తారు. అటువంటి ఈ ప్రముఖ ప్రదేశాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో సైనికులు నిమగ్నమయ్యారు. సోమవారం విక్టరీ ఎట్ సీ వద్ద నున్న స్థూపానికి రంగులు అద్దే పనిలో వీరు మునిగిపోయారు. ప్రతీ ఆదివారం నావికాదళం, జీవీఎంసీ సంయుక్తంగా ఇక్కడ లేజర్ షోను సైతం ప్రదర్శిస్తున్నాయి. ప్రజల్లో దేశ భక్తిని పెంపొందించే విధంగా ఈ ప్రదర్శన కొనసాగుతోంది.

సీఎస్సార్ నిధులతో ఆస్పత్రులు, హాస్టళ్ల అభివృద్ధి

కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సార్) నిధులతో జిల్లాలోని ఆస్పత్రులు, సంక్షేమ హాస్టళ్లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించి, సమర్పించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, విద్య, సంక్షేమ శాఖల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో మంగళవారం సమావేశమైన ఆయన సీఎస్సార్ నిధుల వినియోగం, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలపై సమీక్షించారు. అత్యవసర సేవలకు సంబంధించిన నివేదికలను త్వరితగతిన అందించాలన్నారు. ఈఎన్‌టీ ఆస్పత్రికి తమ వద్ద ఉన్న అంబులెన్సుల్లో ఒకదాన్ని కేటాయించాలని కేజీహెచ్ అధికారుల్ని ఆదేశించారు. చెస్ట్, ఈఎన్‌టీ, మెంటల్ కేర్‌లో ఉండే పీజీ విద్యార్థుల సౌకర్యార్థం వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మించి, అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేజీహెచ్‌లో అదనపు డయాలసిస్ యూనిట్ల ఏర్పాటును ఇప్పటికే ప్రతిపాదించినట్లు వెల్లడించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు బేసిక్ లెర్నింగ్ ఔట్‌కమ్స్ వచ్చేలా ప్రత్యేక ట్యూటర్లను నియమించుకునేందుకు అనుమతించారు.

- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్య సాధనలో వైద్య రంగ అధికారులు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ నిర్దేశించారు. ఆయా రంగాల్లో కీ ఫెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తిరుపతి డబుల్ డెక్కర్ రద్దు

తాటిచెట్లపాలెం: విజయవాడ–గూడూరు సెక్షన్ మధ్య మూడవ లైన్ సంబంధిత నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను పాక్షికంగా దారి మళ్లిస్తున్నట్లు, ఇంకొన్ని రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- ఆగస్టు 14, 16, 18వ తేదీల్లో విశాఖపట్నం–తిరుపతి (22707) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 13, 15, 17వ తేదీల్లో తిరుపతి–విశాఖపట్నం (22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లివే..

- ఈ నెల 28న ఎర్నాకుళం–హౌరా (22878) ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గం కృష్ణాకెనాల్, దుగ్గిరాల, తెనాలి మీదుగా కాకుండా వయా కృష్ణాకెనాల్, న్యూ గుంటూరు, తెనాలి మీదుగా నడుస్తుంది.
- ఆగస్టు 9 నుంచి 19వ తేదీ వరకు విశాఖపట్నం–లింగంపల్లి–విశాఖపట్నం (12805/12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గం కృష్ణాకెనాల్, దుగ్గిరాల, తెనాలి, గుంటూరుల మీదుగా కాకుండా వయా కృష్ణాకెనాల్, మంగళగిరి, గుంటూరు, తెనాలి మీదుగా నడుస్తుంది.

ఎర్నాకుళం–పాట్నా మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎర్నాకుళం–పాట్నా–ఎర్నాకుళం మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఎర్నాకుళం జంక్షన్–పాట్నా(06085) స్పెషల్ రైలు ఆగస్టు 1, 8, 15వ తేదీ(శుక్రవారం)ల్లో రాత్రి 11 గంటలకు ఎర్నాకుళంలో బయలుదేరి, మరుసటిరోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 11.07 గంటలకు బయలుదేరి సోమవారాల్లో తెల్లవారుజాము 3.30 గంటలకు పాట్నా వెళ్తుంది. పాట్నా–ఎర్నాకుళం(06086) స్పెషల్ ఈ నెల 28, ఆగస్టు 4, 11, 18వ తేదీ(సోమవారం)ల్లో పాట్నాలో రాత్రి 11.45 గంటలకు బయలుదేరి బుధవారాల్లో అర్ధరాత్రి దాటిన తర్వాత 1.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.07 గంటలకు బయలుదేరి గురువారాల్లో ఉదయం 10.30 గంటలకు ఎర్నాకుళం వెళ్తుంది.

విద్యా వ్యాపారంపైనే నా యుద్ధం

- ఆగస్టు 22న 'యూనివర్సిటీ పేపర్ లీకేజ్' విడుదల
- కార్పొరేట్ కళాశాలలు, కోచింగ్ సెంటర్ల దురాగతాలే ఈ చిత్ర కథాంశం
- పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి



సినిమా ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న పీపుల్‌స్టార్ నారాయణమూర్తి

మద్దిలపాలెం: సమకాలీన సామాజిక సమస్యలనే కథాంశాలుగా తాను తీసిన చిత్రాలను ప్రేక్షకులు ఆదరించారని పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి తెలిపారు. విద్యను వ్యాపారం చేస్తూ, ర్యాంకుల పేరుతో లీకేజీలకు పాల్పడుతున్న కార్పొరేట్ విద్యా వ్యవస్థపై పోరాటంగా 'యూనివర్సిటీ పేపర్ లీకేజ్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తాను కథనందించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్నేహచిత్ర పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించినట్లు తెలిపారు. ఈ సినిమా ఆగస్టు 22న విడుదల కానుందని.. ప్రేక్షకులు ఆదరించి, ఆశీర్వదించాలని కోరారు. ఈ చిత్ర పోస్టర్‌ను మంగళవారం ఆంధ్రా యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ కోర్టు ప్రాంగణంలో విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. అనంతరం చిత్ర విశేషాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

తల్లిదండ్రుల కన్నీటిగాథలే ఇతివృత్తంగా..

'విద్య, వైద్యం సేవా రంగంలో ఉన్నప్పుడే అందరికీ సమానంగా అందుతాయి. కానీ ఇప్పుడు విద్యను వ్యాపారంతో ముడిపెట్టి, కార్పొరేట్ విద్యకు శ్రీకారం చుట్టారు. కార్పొరేట్ కళాశాలలు మాది ఫస్ట్ ర్యాంక్, మాది బెస్ట్ ర్యాంక్ అంటూ ప్రచార మాధ్యమాల్లో హోరెత్తిస్తూ.. కాసుల కక్కుర్తితో పేపర్ లీకేజీలకు పాల్పడుతున్నాయి. దీని వల్ల కష్టపడి చదివిన పేద విద్యార్థి మంచి ర్యాంకు సాధించలేక చతికిలపడుతున్నాడు. మరోవైపు ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు కిడ్నీలు అమ్ముకునే దుస్థితికి చేరుతున్నారు. వారి ఆవేదన చూసే ఈ చిత్ర నిర్మాణానికి పూనుకున్నాను.' అని నారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీ కారణంగా, తమ పిల్లలకు మంచి విద్యను అందించాలనే తాపత్రయంలో సగటు సామాన్యుడు పడుతున్న కన్నీటి గాథలను ఈ చిత్రం ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నం చేశానని వివరించారు.

పేపర్ లీకేజీ.. అణుబాంబు కన్నా ప్రమాదం

'చూచి రాతలతో డాక్టరైతే ఆ వైద్యం ఎంత ప్రమాదకరమో, కాపీయింగ్‌తో ఇంజినీర్ అయి భవనాలు నిర్మిస్తే ఎంత ముప్పు వాటిల్లుతుందో మనం ఊహించవచ్చు. పేపర్ లీకేజీ అణుబాంబు కంటే ప్రమాదం. నేడు మన విద్యా వ్యవస్థ అలాంటి ప్రమాద ఘంటికల మధ్య నలిగిపోతోంది. దీనిపై పోరాటం తక్షణ అవసరం. చివరికి కోచింగ్ సెంటర్లు కూడా తమ సెంటర్లలో అభ్యర్థులను చేర్పించుకొని కాసులు దండుకోవడానికి పోటీ పరీక్షల పేపర్లను లీక్ చేస్తున్నాయి. అలా లీక్ అయిన పేపర్లతో ర్యాంకులు సాధించి ప్రచారం చేసుకుంటున్నాయి. గుజరాత్, బీహార్, ఒడిశా వంటి రాష్ట్రాల్లోలో నీట్ పరీక్ష పత్రాల లీకేజీల గురించి విన్నాం. ఇలాంటి విష సంస్కృతికి అంతిమ గీతం పాడాలి. ప్రజా చైతన్యంతోనే దాన్ని అంతమొందించగలం.' అని నారాయణమూర్తి పిలుపునిచ్చారు.

కార్పొరేట్ విద్య మోజులో పడొద్దు

'పూర్వం ఆస్తులు, పొలాలు ఇచ్చేవారు. నేడు ప్రతి తల్లిదండ్రీ తమ పిల్లలకు మంచి విద్యను ఆస్తిగా ఇవ్వాలని తపన పడుతున్నారు. వారి తపననే ఆసరాగా చేసుకొని కార్పొరేట్ కళాశాలలు దోపిడీకి పాల్పడుతున్నాయి. అలాంటి కార్పొరేట్ విద్య మోజులో పడి ఆర్థికంగా కుంగిపోవద్దు' అని ఆయన హితవు పలికారు. 'విద్యార్థులు ఇష్టమైన కోర్సులో చేరి కష్టపడి చదవాలి. ఉన్నత శిఖరాలను అధిరోహించి, కన్నవారి కలలను సాకారం చేయాలి. లీకేజీల విద్యా వ్యవస్థలో పడి మీ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు' అని నారాయణమూర్తి సూచించారు.

పాట పాడి ఉత్సాహపరిచిన పీపుల్స్ స్టార్

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల అభ్యర్థన మేరకు 'నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా..'' వందనం వందనం ఆది గురువు అమ్మకు, సకలం బోధించే గురువులకు వందనం..'అనే పాటలను పాడి విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను గెలిచి.. కొడుకుకు కిడ్నీనిచ్చి..

కన్నప్రేమకు సలాం

- ఏఐఎన్‌యూలో అరుదైన కిడ్నీ మార్పిడి

డాబాగార్డెన్స్: రెండేళ్ల కిందట క్యాన్సర్‌తో పోరాడి గెలిచిన ఆ తండ్రి.. ఇప్పుడు తన కుమారుడి ప్రాణాలను నిలబెట్టేందుకు గొప్ప త్యాగం చేశాడు. కిడ్నీ వైఫల్యంతో డయాలసిస్‌పై జీవిస్తున్న కన్న కొడుకును చూసి ఆ తండ్రి హృదయం తల్లడిల్లింది. తన ప్రాణాన్ని పణంగా పెట్టి, తన కిడ్నీనే దానం చేసి కుమారుడికి కొత్త జీవితాన్ని ప్రసాదించాడు. వివరాల్లోకి వెళ్తే.. 60 ఏళ్ల ఎడ్ల పైడయ్యకు రెండేళ్ల కిందట ఉదర క్యాన్సర్ సోకగా, శస్త్రచికిత్సతో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. అయితే విధి ఆయనకు మరో పరీక్ష పెట్టింది. ఆయన 37 ఏళ్ల కుమారుడు లక్ష్మణుడు కిడ్నీ వైఫల్యంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. పరీక్షలు నిర్వహించగా అతనికి 'ఎల్‌పోర్ట్ సిండ్రోమ్'అనే అరుదైన జన్యుపరమైన వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వ్యాధి వల్ల కిడ్నీలు పనిచేయకపోవడంతో పాటు క్రమంగా వినికిడి శక్తి, కంటి చూపు కూడా దెబ్బతింటాయని ఏఐఎన్‌యూ ఆసుపత్రి కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టులు డాక్టర్ ఉదయ్‌దీపక్‌రావు గజారే, డాక్టర్ వైష్ణవి తెలిపారు. కుమారుడి పరిస్థితి చూసి చలించిపోయిన తండ్రి పైడయ్య, తానే కిడ్నీ దానం చేయడానికి దృఢ సంకల్పంతో ముందుకొచ్చారు. అయితే ఆయన క్యాన్సర్ నుంచి కోలుకున్న వ్యక్తి కావడంతో కిడ్నీ దానం చేయడం అత్యంత సంక్లిష్టమైన విషయం. దీనిని ఏఐఎన్‌యూ వైద్య బృందం ఒక సవాలుగా స్వీకరించింది.

పైడయ్యకు సమగ్ర వైద్య పరీక్షలు, పెట్ సిటీ స్కాన్ నిర్వహించి, అంకాలజిస్ట్ నుంచి అనుమతి పొందిన తర్వాతే ఆయన కిడ్నీ దానానికి అర్హుడని నిర్ధారించారు. అనంతరం ఆసుపత్రి ఎండీ, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ జి. రవీంద్రవర్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ సాప్లే, డాక్టర్ పి.శ్రీధర్ నేతృత్వంలోని అనుభవజ్ఞులైన వైద్య బృందం అత్యంత విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను పూర్తి చేసింది. ఒకవైపు క్యాన్సర్‌ను జయించి, మరోవైపు కుమారుడికి ప్రాణదానం చేసిన పైడయ్య త్యాగం అందరికీ ఆదర్శమని వైద్యులు కొనియాడారు.

'సాక్షి' మీడియాపై కక్ష సాధింపు తగదు

సామాజికవేత్త, న్యాయవాది గుండుపల్లి సతీష్


కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న సతీష్

బీచ్‌రోడ్డు: సమాజంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పేర్కొనే మీడియా సంస్థలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని సామాజికవేత్త, న్యాయవాది గుండుపల్లి సతీష్ అన్నారు. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'రాజకీయాలు వేరు. పత్రికా స్వేచ్ఛ వేరు. ప్రజాస్వామ్యంలో ఎవరి అభిప్రాయాలు వారు వ్యక్తం చేయడంలో ఎలాంటి తప్పులేదు. ప్రతి వ్యక్తికి, ప్రతి సంస్థకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కును అధికారం అడ్డుపెట్టుకొని కాలరాయడం తగదు. నెలల తరబడి సాక్షి మీడియా ప్రసారాలను కేబుల్ టీవీలలో నిలిపివేయడం ప్రభుత్వ పక్షపాత ధోరణిగా కనిపిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో దీనిపై అనేక మంది నిరసన తెలుపుతున్నారు. కేబుల్ టీవీలతోపాటు ప్రభుత్వ ప్రసార మాధ్యమాల్లో కూడా సాక్షి మీడియాను నిషేధించడం సమర్థనీయం కాదు' అని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించి, సాక్షి మీడియా ప్రసారాలు వెంటనే కేబుల్ టీవీల్లో ప్రసారం అయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.

లక్ష్మీనరసమ్మ పార్థివదేహం అప్పగింత


లక్ష్మీనరసమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

డాబాగార్డెన్స్: ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిటు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెజెల్ల తులసీరాం తల్లి లక్ష్మీనరసమ్మ(103) దేహాన్ని ఆంధ్రా మెడికల్ కళాశాల విద్యార్థుల పరిశోధన కోసం మంగళవారం అప్పగించారు. పాత డెయిరీఫాం సమీపంలోని తులసీరాం స్వగృహంలో మంగళవారం ఆమె కన్నుమూశారు. లక్ష్మీనరసమ్మ భౌతికకాయాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, సీపీఎం నాయకులు పి.మణి, వి.కృష్ణారావు, నరేంద్రకుమార్, పి.వెంకట్రావు, డి.అప్పలరాజుతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, పెన్షనర్స్ సందర్శించి నివాళులర్పించారు. లక్ష్మీనరసమ్మ తాను మరణించిన తర్వాత కళ్లు, దేహాన్ని దానం చేయాలని జీవించి ఉన్నప్పుడే పిల్లలకు సూచించారు. ఆమె కోరిక మేరకు జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహక సంస్థ ద్వారా కళ్లు, దేహాన్ని ఆమె కుమారుడు తులసీరాం ఏఎంసీకి అప్పగించారు. తులసీరాం నిర్ణయం సమాజానికి స్ఫూర్తిదాయకమని జగ్గునాయుడు, ఆర్కేఎస్వీ కుమార్ అన్నారు.

ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను తిరస్కరించండి

కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపు


లాంతర్లే దిక్కంటూ రౌండ్ టేబుల్ సమావేశంలో నిరసన తెలుపుతున్న జిల్లా కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక

డాబాగార్డెన్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల ఇళ్లకు బిగిస్తున్న అదానీ విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని జిల్లా కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. మంగళవారం జగదాంబ జంక్షన్ సమీపంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.ఎస్.జె. అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సమావేశంలో పాల్గొన్న సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.కె. రెహమాన్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. అదానీ లాభాల కోసం మోదీ ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగింపునకు పూనుకుంటోందని విమర్శించారు. ఇది విద్యుత్‌ను సంపూర్ణంగా ప్రైవేటీకరించే కుట్రలో భాగమని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు బిగించిన దుకాణాలు, వ్యాపారులకు ఇప్పటికే పెద్ద ఎత్తున చార్జీలు పెరిగి బిల్లులు వస్తున్నాయని, వారు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ప్రజల ఇళ్లకు ఈ మీటర్లు బిగించడానికి ప్రభుత్వం సిద్ధపడిందని, ఈ మీటర్ల వల్ల నష్టం లేదని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ద్వారా మోసపూరిత ప్రకటనలు చేయిస్తోందని విమర్శించారు. సింగిల్ ఫేజ్ మీటరుకు రూ.8,927, త్రీఫేజ్ మీటరుకు రూ.17,266 వసూలు చేయాలని ప్రభుత్వ నిర్ణయమని, ఈ మొత్తం ఒకేసారి కాకుండా.. ప్రతి నెలా బిల్లులో 93 నెలల పాటు వసూలు చేయాలని నిర్ణయించారని తెలిపారు. అదానీ మీటర్ల వల్ల ప్రజలపై రూ.25 వేల కోట్ల అదనపు భారం పడుతుందని, పీక్‌టైమ్ పేరుతో రాత్రులు, సెలవు రోజులు, వేసవికాలాల్లో మరింత పెద్ద ఎత్తున చార్జీలు వేస్తారని హెచ్చరించారు. ప్రస్తుతం కరెంటు ఉపయోగించి, బిల్లు వచ్చిన 15 రోజుల్లోపు కట్టే అవకాశం ఉండగా.. అదానీ స్మార్ట్ మీటర్లకు ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేసుకోవాలని, రీఛార్జ్ కాకపోతే చీకట్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు.

హామీల అమలుకు డిమాండ్

కూటమిని గెలిపిస్తే స్మార్ట్ మీటర్లు, ట్రూ–అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు రద్దు చేస్తామని హామీనిచ్చారని, ఇచ్చిన హామీ మేరకు వీటిని రద్దు చేయాలని ఐక్యవేదిక డిమాండ్ చేసింది. హామీల సాధనకు ఈ నెల 23 నుంచి 26 వరకు జోన్లు, మండలాలు వారీగా రౌండ్ టేబుల్ సమావేశాలు, సెమినార్లు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 29న జిల్లా సదస్సు, 30 నుంచి ఆగస్టు 1 వరకు కాలనీల వారీగా సమావేశాలు, ప్రదర్శనలు, 2న జిల్లాలోని అన్ని విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసనలు, 5న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు నేతలు ప్రకటించారు. ఈ సమావేశంలో కె.వనజాక్షి, ఎం.ఎ.బేగం, ఆర్.విమల, బి.మమత, కె.దేవసహాయం, టి.శ్రీరామమూర్తి, ఎన్.ప్రకాష్ రావు, వై.రాంబాబు, ఎల్.జె.నాయుడు, వై.రాజు, కె.ఎం.కుమార మంగళం, ఎం.సుబ్బారావు, కె.వెంకట్రావు, సుశీల, డి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డాక్టర్ బాగోతం బట్టబయలు

కిడ్నీ మార్పిడి పేరుతో ఘరానా మోసం

తాటిచెట్లపాలెం: కిడ్నీలు మార్పిస్తానంటూ నమ్మించి, తనను తాను డాక్టర్‌గా పరిచయం చేసుకుని అమాయకులను మోసం చేస్తున్న వ్యక్తిని ఫోర్త్ టౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. డాక్టర్ ఆనంద్ అనే పేరుతో చెలామణి అవుతున్న ఈ వ్యక్తి అసలు పేరు సయ్యద్ హనీఫ్ షా. అతను వైద్యుడు కాదని పోలీసులు తేల్చారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలివి.

మోసం చేసిన తీరిది

అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన సయ్యద్ హనీఫ్.. కిడ్నీ దాతల వివరాలు ఆన్‌లైన్‌లో సేకరించి, వారికి ఫోన్ చేసేవాడు. తాను డాక్టర్ ఆనంద్‌నని, కిడ్నీ మార్పిడికి అన్ని ఏర్పాట్లు చేస్తానని నమ్మించేవాడు. బాధితులను విశాఖపట్నం రప్పించి, అక్కయ్యపాలెం హైవే సమీపంలోని బీకాన్ హోటల్‌లో గదులు బుక్ చేయించేవాడు. ఆ తర్వాత లాయర్ ఫీజు, ఇతర ఖర్చుల పేరుతో వారి నుంచి ఫోన్‌పే ద్వారా వేలాది రూపాయలు వసూలు చేసేవాడు. డబ్బు తన ఖాతాలో పడగానే బాధితుల ఫోన్ నంబర్లను బ్లాక్ చేసి, అదృశ్యమయ్యేవాడు.

ఇదే క్రమంలో జనవరి 28న ఒడిశాకు చెందిన ముగ్గురు వ్యక్తులను విశాఖకు రప్పించాడు. ఫోన్‌పే ద్వారా రూ.4 వేలు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. తర్వాత వారి ఫోన్ నంబర్లకు బ్లాక్ లిస్ట్‌లో పెట్టేశాడు. జనవరి 30న మరో ఇద్దరిని అదే హోటల్‌కు రప్పించాడు. లాయర్ ఫీజు అని చెప్పి డబ్బులు వేయమని వారిని కోరగా.. తమ వద్ద ఫోన్ పే లేదని, నేరుగా కలుద్దామని చెప్పడంతో వారి నంబర్లను బ్లాక్‌లో పెట్టేశాడు. బాధితులు హోటల్ బిల్లులు కూడా చెల్లించకుండా వెళ్లిపోవడంతో, మోసపోయిన హోటల్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యాపారి కాస్తా.. నకిలీ డాక్టర్‌గా..

హోటల్ మేనేజర్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు సయ్యద్ హనీఫ్ రైస్ వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయాడు. అప్పుల ఊబిలో కూరుకుపోయి, తన కిడ్నీ అమ్ముకోవడానికి హైదరాబాద్ వెళ్లాడు. అయితే అధిక కొలెస్ట్రాల్ కారణంగా అతని కిడ్నీ దానానికి పనికిరాదని వైద్యులు తేల్చారు. దీంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నాడు. 2016లో కూడా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఒక వ్యక్తి నుంచి ఇదే విధంగా రూ.10 వేల వసూలు చేసి మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి కాల్ డేటా, బ్యాంక్ ఖాతాలను పరిశీలించగా, అతనికి ఏ ఆసుపత్రితో గానీ, వైద్యులతో గానీ ఎటువంటి సంబంధాలు లేవని, ఇది కేవలం ఆర్థిక మోసం మాత్రమేనని పోలీసులు నిర్ధారించారు. నిందితుడు సయ్యద్ హనీఫ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

బంగారు కుటుంబాల మ్యాపింగ్ వేగవంతం

అధికారులకు జేసీ ఆదేశం

బీచ్‌రోడ్డు: స్వర్ణాంధ్ర జీరో పావర్టీ–పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమంలో భాగంగా.. మార్గదర్శకులకు బంగారు కుటుంబాల మ్యాపింగ్‌పై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎంపిక చేసిన 2,600 మంది మార్గదర్శకులకు ఒక్కొక్కరికీ 10 బంగారు కుటుంబాల చొప్పున 26 వేల బంగారు కుటుంబాల మ్యాపింగ్‌ను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఆగస్టు 15 నాటికి 73 శాతం లక్ష్యం సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. సమీక్షలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్తిబాబు, జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మణరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి వీవో ఎక్స్200ఎఫ్ఈ ఫోల్డ్ 5 స్మార్ట్‌ఫోన్


స్మార్ట్ ఫోన్ లాంచ్ చేస్తున్న సినీ నటి శ్రీదేవి, సెల్‌పాయింట్ అధినేత మోహన్‌ప్రసాద్ పాండే

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్‌లోని సెల్‌పాయింట్ షోరూంలో మంగళవారం వీవో ఎక్స్ 200ఎఫ్ఈ ఫోల్డ్ 5 స్మార్ట్‌ఫోన్‌ను కోర్టు మూవీ ఫేమ్ శ్రీదేవి ఆవిష్కరించారు. సెల్‌పాయింట్ అధినేత మోహన్ ప్రసాద్ పాండే, ఎండీ బాలాజీ పాండే, దినేష్ పాండే, ఏఎస్ఎంలు వేంకటేష్, గోవింద్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సినీ నటి శ్రీదేవి ఈ మొబైల్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసి దాని ప్రత్యేకతలను వివరించారు. ఫ్లాగ్‌షిప్ మోడల్స్ అయిన ఈ ఫోన్ అద్భుతంగా ఉందని, బ్యాటరీ బ్యాకప్ చాలా బాగుందని పేర్కొన్నారు. 50 ఎంపీ జెస్సీ కెమెరా, అత్యాధునిక ఫీచర్లతో యువతకు నచ్చే విధంగా ఉందన్నారు. ముఖ్యంగా రీల్స్ చేసేవారు ఈ మొబైల్ ద్వారా సులువుగా వీడియోలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ మోడల్ రెండు వేరియంట్లలో.. 12జీబీ ర్యామ్, 256 జీబీ, 16 జీబీ ర్యామ్, 512 జీబీ స్టోరేజ్‌తో మార్కెట్‌లో అందుబాటులో ఉందన్నారు. సెల్‌పాయింట్ ఎండీ బాలాజీ పాండే మాట్లాడుతూ విశాఖ తొలిసారిగా డైమండ్ పార్క్ వద్ద సెల్‌పాయింట్ ప్రారంభించామని, అంచెలంచెలుగా ఎదుగుతూ విశాఖలో 29 స్టోర్లు, రాష్ట్రవ్యాప్తంగా 82 సెల్‌పాయింట్ స్టోర్లకు విస్తరించామని చెప్పారు. వీవో ఏజీఎం ఎస్‌బీబీ సతీష్ కుమార్, ఏపీ సేల్స్ హెడ్ ఆజాద్, నాగవంశీ, సూర్య, బిలాల్, మనోహర్ పాల్గొన్నారు.

ఇండియన్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

అల్లిపురం: హోటల్ గ్రీన్‌పార్క్‌లో మంగళవారం 'ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో'ప్రారంభమైంది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఎక్స్‌పోను ప్రారంభించి మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన అద్భుతమైన వస్త్ర సంపదను ఇక్కడ అందుబాటులో ఉంచారని, నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారతీయ సంప్రదాయ వస్త్రాల వైభవాన్ని, విశాఖపట్నం ప్రజలకు చక్కని షాపింగ్ అనుభూతిని ఈ ప్రదర్శన అందిస్తుందన్నారు. సుమారు 14 రాష్ట్రాలకు చెందిన హస్తకళాకారుల చేతుల్లో రూపొందించిన అత్యద్భుతమైన డిజైన్లు ఇక్కడ కొలువైనట్లు చెప్పారు. ఎక్స్‌పో నిర్వాహకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గుర్తించిన సిల్క్ మార్క్ ఉత్పత్తులను మాత్రమే ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పోను ప్రతి ఒక్కరూ సందర్శించి.. నాణ్యమైన చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని కోరారు.

విహారంలో విషాదం

- బ్రేక్‌లు ఫెయిలై కొండను ఢీకొన్న మినీ బస్సు
- 18 మందికి పర్యాటకులకు గాయాలు
- డ్రైవర్ పరిస్థితి విషమం


ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

అనంతగిరి (సాక్షి, పాడేరు): మినీ బస్ బోల్తా పడి 18 మంది పర్యాటకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరంలో ఒకే కుటుంబానికి చెందిన 21 మంది మినీ బస్సులో అరకు పరిసర ప్రాంతాల సందర్శనకు సోమవారం రాత్రి బయలుదేరారు. మంగళవారం ఉదయం ఆరు గంటలకు అరకు చేరుకున్నారు. పరిసర ప్రాంతాలను సందర్శించిన అనంతరం మధ్యాహ్నం బొర్రా గుహలు తిలకించి తిరుగు పయనమయ్యారు. సాయంత్రం సుమారు ఐదు గంటల సమయంలో వాహనం ఘాట్ దిగుతుండగా శివలింగపురం పరిసరాలకు వచ్చేసరికి మినీ బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో వాహనం కొండను ఢీకొని బోల్తాపడింది. దీంతో బస్సులో ఉన్న 21 మంది ప్రయాణికుల్లో 18 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని తక్షణమే శృంగవరపుకోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్రైవర్ కుమార్ స్వామి తీవ్ర గాయాలు కావడంతో విజయనగరం తరలించారు. మిగతా క్షతగాత్రులందరికి ప్రథమ చికిత్స అందించి డిశ్చార్జ్ చేశారు. వారంతా రాజమహేంద్రవరం బయలుదేరారు. అనంతగిరి ఎస్ఐ శ్రీనివాసరావు శృంగవరపుకోట ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు నలుగురు ఎంపిక


హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

యలమంచిలి రూరల్: జిల్లాకు చెందిన నలుగురు హాకీ క్రీడాకారులు జాతీయ స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలకు ఎంపికైనట్టు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి కొణాలు నరేష్ తెలిపారు. పండూరి భరత్, చరణ్, దేవేందర్ వెంకట్, స్వరూప్‌లు ఈ నెల 28 నుంచి చెన్నైలో జరగనున్న హాకీ పోటీల్లో ఏపీ జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల్లో నక్కపల్లికి చెందిన ఇద్దరు, అనకాపల్లి, యలమంచిలి పట్టణాల నుంచి ఒక్కొక్కరు ఉన్నారని చెప్పారు.